బాబు తప్పుడు హామీలను ప్రజలు నమ్మరు

• ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు తప్పుడు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. పెనుకొండ మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ బొజ్జారెడ్డిపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్లు, జగనన్న నివాస గృహాలను మంజూరు చేయాలని అభ్యర్థించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సుపరిపాలనే ధ్యేయం

ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రజారంజక పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఇంకా సమస్యలేమైనా ఉన్నాయా? అని తెలుసుకొని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సమస్యలు తెలుసుకొని ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలును అందిస్తు ప్రజా రంజకపాలన అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పడం ఖాయం

ఈ మధ్య నిర్వహించిన మహానాడులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తప్పుడు హామీలను ప్రకటించి ప్రజలను నమ్మించాలని యత్నిస్తున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. అయితే ఆయన హామీలను విశ్వసించే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రస్తుత హామీలను పక్కన పెడితే 2014లో ఇచ్చిన 600 హామీలు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో వ్యవసాయం దండగ అన్న వ్యక్తి, తీగల మీద బట్టలు ఆరేసుకోవాలన్న మనిషి... ఈ రోజు మళ్లీ అవే హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

మహిళా ద్రోహి చంద్రబాబు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మహిళా ద్రోహి అని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ విమర్శించారు. 2014 ఎన్నికల్లో మహిళల ఓట్లతో గద్దెనెక్కి డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా అందరినీ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో ప్రజలు ఏ విధంగా బుద్ధి చెప్పారో 2024లోనూ అలాగే బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, ఎంపీడీఓ శివశంకప్ప, సర్పంచ్ శ్యామలబాయి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ జ్యోతి బాయి, డీలర్ నారాయణరెడ్డి, తిరుపాల్ నాయక్, మదన్ మోహన్‌రెడ్డి, అంజినరెడ్డి, శ్రీరామరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జయశంకరరెడ్డి, కొండల రాయుడు పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



రొళ్ల మండలం అలుపనపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పేదల జీవితాల్లో వెలుగులు

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: 'రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయి. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిందే' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రత్నగిరి సచివాలయం పరిధిలోని అలుపనపల్లిలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీటీసీ జగదీష్‌బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తు కుటుంబానికి నాలుగేళ్ల పాలనలో అందించిన బుక్‌లెట్లను అందించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలనలో ఎక్కడా కూడా రాజీ లేకుండా 95 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్డు ఏర్పాటు, తాగునీటి సమస్యతో పాటు ఇతరాత్ర సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సింగిల్ విండో అధ్యక్షుడు మోతీరాంనాయక్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, తహసీల్దార్ హసీనా సుల్తానా, సీఐ సురేష్‌బాబు, ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ కృష్ణప్ప, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, నాయకులు రామిరెడ్డి, సిద్ధరామప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లి పాలు అమృతంతో సమానం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లిపాలు అమృతంతో సమానమని, ముర్రుపాలలో అత్యధిక ఔషాద గుణాలు కల్గింటాయని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కేశవులు అన్నారు. జిల్లా అఖిల భారత చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో చిన్న పిల్లల అనుబంధ ఆహార దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐఎంఐహాల్ నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం నిర్వహించారు. సమాఖ్య కోశాధికారి డాక్టర్ సుప్రవీన్, ఐఎంఎ అధ్యక్షులు బివి రమణలు పాల్గొన్నారు.

నేడు చేపల చెరువు వేలం

లేపాక్షి: మండలంలోని శిరివరం–మానేపల్లి గ్రామాల ఉమ్మడి చెరువుతో పాటు గోపిందేవరపల్లి చెరువులకు బుధవారం ఉదయం 10 గంటలకు శిరివరం పంచాయతీ కార్యాలయంలో చేపల వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు.

ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించండి



డీటీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

హిందూపురం టౌన్: తగ్గించిన ఆర్టీసీ సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని డీటీఓ మధుసూదన్‌ను ఎన్ఎంయూఏ హిందూపురం డిపో కమిటీ, రీజనల్ కమిటీ నాయకులు కోరారు. మంగళవారం పుట్టపర్తిలోని డీటీఓ కార్యాలయంలో డీటీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్లే సర్వీసుల చార్జీలను తగ్గించాలని, బస్సుల సంఖ్యను పెంచి, కొత్త బస్సులను ఇవ్వాలన్నారు. డ్రైవర్లకు పనిభారమైన తిరుపతి సర్వీసులకు ఉన్న లింకులను వెంటనే తొలగించాలన్నారు.

ద్వేష రాజకీయాలకు గురువు తిమ్మరాయప్పే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్

పావగడ: ద్వేష రాజకీయాలు, కుళ్లు కుతంత్రాలకు రాజ గురువు స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పేనని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఎద్దేవా చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు మానం వెంకటస్వామి ఇంటి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. జేడీఎస్ నాయకులు ఆర్సి అంజినప్ప, తిమ్మారెడ్డికి ద్వేష రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. త్వరలోనే పట్టణంలో రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏడాదిలోగా తుంగభద్ర, ఎగువ భద్ర, ఎత్తినహొళె జలాలను తరలించి పావగడను సస్యశ్యామలం చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు మానం వెంకటస్వామి, సుదేశ్ బాబు, విశ్వనాథ్, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు దక్కడం హర్షణీయం

పరిగి: మండలంలోని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాలలో చదివిన 29 మంది పదో తరగతి పాసైన విద్యార్థులకు మాస్టర్ మైండ్స్‌చే ప్రతిభా పురస్కారాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్‌బాబు తెలిపారు. సోమవారం సాయంత్రం హిందూపురంలోని జరిగిన కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ యాజమాన్యం 550 మార్కులు సాధించిన 29 మందికి ప్రోత్సాహక నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందించినట్లు తెలిపారు. ప్రతిభావంతులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పదో తరగతి టాప్ ర్యాంకర్లతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

నిర్వాసితులందరికీ నష్టపరిహారం

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి, గోరంట్ల గ్రామ పంచాయతీల్లో జాతీయ రహదారి (342)కు భూసేకరణపై మంగళవారం ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగనాయకులు రైతులతో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ రంగనాయకులు మాట్లాడుతూ కడప జిల్లా నుంచి పుట్టపర్తి ,గోరంట్ల మీదుగా జాతీయ రహదారి 44ను కలుపుతూ 342 జాతీయ రహదారిని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గోరంట్ల మండలంలోని మందలపల్లి, గోరంట్ల, బూదిలి రెవెన్యూ పొలాల్లో రోడ్డు నిర్మాణం కోసం సర్వే నిర్వహించి భూములు గుర్తించామన్నారు. రోడ్డు కోసం భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ద్వారా నష్టపరిహారం అందజేస్తామన్నారు. రైతుల జాబిత సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా గ్రామాల రెవెన్యూ అధికారికి తెలియజేయాలన్నారు. సర్పంచులు ప్రమీల, సరోజబాయి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రంగనాయకులు

అనేక సమస్యలకు పరిష్కారం

మడకశిర: మడకశిరలో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించడంతో నియోజకవర్గంలోని అనేక సమస్యలకు పరిష్కారం దొరికిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిర కేంద్రంగా జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నందుకు కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. అవకాశం వచ్చినప్పుడల్లా మడకశిరలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

అమరాపురం: గ్రామీణ తపాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ అధికారి నవీన్ పేర్కొన్నారు. మంగళవారం తమ్మడేపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో గ్రామీణ తపాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టల్ ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. రూ.600 ప్రీమియం చెల్లిస్తే ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలను కుటుంబానికి అందిస్తామని నవీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామీణులు ప్రీమియం చెల్లించారు. పోస్టుమాస్టర్లు నాగేగౌడ, మానస, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి

పెనుకొండ: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని విశాఖకు చెందిన పాస్టర్ బంక విజయరాజ్, స్థానిక బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో మంగళవారం మోక్ష మార్గం ఉప దేశ సభలు ప్రారంభమయయాయి. తొలిరోజు వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాస్టర్లు బంక్ విజయరాజ్, సుధాకర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోకకళ్యాణార్థం రెండోసారి రాబోతున్నారని తెలిపారు. దైవ మార్గంలో నడిచే వారికే పరలోక ప్రవేశమని స్పష్టం చేశారు. అనిల్‌కాంత్, విజయనాథ్, విజయరత్నం, సల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి పట్టు వస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

పరిగి: జగనన్న లేఅవుట్‌లతో పాటూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నవంబర్ లోపు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ అధికారులతో పాటూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ సరస్వతి, హౌసింగ్ ఏఈ సునిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తలసేమియా బాధితుడి న్యాయం

మడకశిర: మడకశిరలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి స్థానిక అధికారులు చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే అర్జీ ఇచ్చి ఒక్కరోజులోనే తలసేమియా వ్యాధిగ్రస్తుడికి న్యాయం చేయడానికి అధికారులు నడుం బిగించారు. పట్టణంలోని 17వ వార్డు (పాత ఎస్సీ కాలనీ)లో నివాసం ఉంటున్న హనుమంతప్ప కుమారుడు అఖిల్ (10) తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారు. పింఛన్ కోసం పలు సార్లు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ కౌన్సిలర్ నాగేంద్ర సహాయంతో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఈక్రమంలో మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మంజుల బాధితుడి ఇంటికి చేరుకుని వివరాలను సేకరించారు. అఖిల్‌కు పింఛన్ మంజూరుకు సిఫార్సు చేశారు.



స్పందన అర్జీలపై వివరాలు సేకరిస్తున్న డాక్టర్ మంజుల

సంక్షిప్త సమాచారం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో బుధవారం ఉదయం 7 గంటలకు మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

నేటి నుంచి సువార్త సభలు

హిందూపురం టౌన్: పట్టణంలోని సుగూరులో బైబిలు మిషన్ స్వస్థతశాలలో బుధ, గురు, శుక్రవారాల్లో మూడు రోజులపాటు బైబిల్ మిషన్ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు బైబిల్ మిషన్ సంఘ సభ్యుడు దేవరాజు తెలిపారు. సభలకు గవర్నింగ్ బాడీ మెంబర్ జోసఫ్ శ్యామ్యూల్, స్తోత్రం రాజు, జాన్సన్, బెనర్జీ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

మండలాభివృద్ధికి కృషి

రొద్దం: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న వివిధ పనులు, సంక్షేమ పథకాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే మండలం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు.

సచివాలయం తనిఖీ

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి సచివాలయాన్ని మంగళవారం ఈఓఆర్డీ సుధాకర తనిఖీ చేశారు. సచివాలయంలో నిర్వహించే రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే వారిని తిప్పుకోకుండా నిర్ణీత సమయంలోగా వారి పనులను చేయాలని ఆదేశించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ: సోమందేపల్లి మండలం పత్తికుంటపల్లిలో మంగళవారం సరస్వతమ్మ అనే మహిళ ఇంట్లో 60 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సమయపాలన పాటించాలి

మడకశిర: వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని మాళేరొప్పం వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సమయానికి విధులకు హాజరు కావాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అతిసారం నివారణపై అవగాహన

చిలమత్తూరు: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రామకృష్ణ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అతిసార నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రాగి పంట సాగు చేయండి

రొళ్ల: బోరుబావుల కింద నీటి వసతి ఉన్న రైతులతో పాటు వర్షాధార పంటగా కూడా విస్తృతంగా రాగి పంటను సాగు చేయాలని ఏఓ రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని గుడ్డగుర్కి, దొడ్డేరి ఆర్బీకే ఆవరణలో రాగి పంట సాగుపై రైతులతో సమీక్షించారు.

మురుగు సమస్య పరిష్కారం

హిందూపురం: పట్టణ పరిధిలోని మొక్కుపల్లి 21వ వార్డులో నెలకొన్న మురుగు సమస్య పరిష్కరించామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మారుతీరెడ్డి తెలిపారు. వార్డుల్లో మురుగు కాల్వ సరిలేక మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తుండేదన్నారు. అధికారులతో మాట్లాడి కొత్తగా మురుగుకాల్వ నిర్మాణం చేపట్టామన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

లేపాక్షి: మండలంలోని రాజీవ్‌కాలనీలో వెలిసిన దండు మారిగమ్మ ఆలయ అభివృద్ధికి విశ్రాంత ఏపీ ఎస్ఎఫ్‌సీ జనరల్ మేనేజర్ నరసప్ప రూ. 27 వేలు, టీచర్ మద్దిలేటప్ప రూ.10,116 విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకిచ్చారు.

పాఠశాలలకు పుస్తకాల సరఫరా

గుడిబండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండల విద్యాధికారి కార్యాలయం నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు సరఫరా చేసినట్లు చెప్పారు.